ACCION FRATERNA ecology centre sustainable . human . nature

# ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, అనంతపురం.

## ఈ మాసపు సమాచారం డిశెంబర్ 2008

FOR PRIVATE CIRCULATION ONLY

## మీకు తెలుసా !

- చెండు మల్లె చెట్టు ఆకులను శుభ్రంగా కడిగి మెత్తగాదంచి బట్టలో వేసి పిండిన రసం 10 గ్రాముల మోతాదుగా ఉదయం, సాయంత్రం భోజనానికి ముందర తీసుకుంటూ ఉంటే మూర్ఛ, అపస్మారకం, తలనొప్పులువంటివి తగ్గుతాయి. అదే విధంగా ఈ ఆకులరసం కొంచెం వేడిచేసి చెవిలో నాలుగు-అయిదు చుక్కలు వేస్తోంటే, చెవి నొప్పి, చెవిలో చీము తగ్గుతాయి.
- చెండుమల్లె ఆకురసం గుక్కెడు మోతాదుగా నోటిలో పోసుకుని అయిదు నుండి పది నిమిషాలు పుక్కిలించి ఉమ్మివేస్తుంటే పళ్ళలో రక్తం కారడం, పండ్లు కదలడం, చిగుళ్ళు రావడం మొదలగు సమస్యలు తొలగిపోతాయి.
- చెండు మల్లెపూల అడుగున ఉండే బొడ్డును విడిగా తీసి ముక్కలుచేసి ఆరబెట్టి దంచి జల్లించి దానితో సమానంగా కండ చక్కెర నిలువచేసుకోవాలి. రోజూ రెండు పూటలా ఆహారం తీసుకోవడానికి అరగంట ముందుగా మూడు వేళ్ళకు వచ్చినంత పొడి నోటిలో వేసుకుని గోరువెచ్చని నీరు తాగితే దగ్గు, ఉబ్బసం, ఆయాసం తగ్గిపోతాయి.
- చెండు మల్లె చెట్టు ఆకులను కడిగి నీడలో గాలి తగిలే చోట ఆరబెట్టాలి. బాగా ఎండిన తర్వాత మెత్తగా దంచి జల్లించి ఆ పొడిని నిలువ చేసుకోవాలి. ఆ పొడిని పావు చెంచా మోతాదుగా రెండు పూటలా ఆహారానికి గంట ముందు మంచి నీటితో సేవిస్తే బాగా ఆకలి పెరుగుతుంది. తిన్న పదార్థాలు సులభంగా జీర్ణమవుతాయి.
- చెండుమల్లె ఆకులను కడిగి దంచి తీసిన రసం రెండు మూడు చెంచాల మోతాదుగా వయసు, వ్యాధి తీవ్రతను బట్టి రెండు పూటలా లోపలికి సేవిస్తే, చప్పిడిపథ్యం పాటిస్తూ ఉంటే పసిరకలు తగ్గిపోతాయి. కాలేయానికి బలం కలుగుతుంది.
- రాత్రి నిద్రించేముందు పావు లీటరు మంచి నీటిలో కండచక్కెర పొడి 60 గ్రాములు కలిపి మూతబెట్టి మంచం పక్కన పెట్టుకోవాలి. తెల్లవారి లేవగానే ఆ నీటిని కొద్ది కొద్దిగా తాగాలి. తాగిన మరో అరగంట వరకూ ఇతర పదార్థాలేవీ తీసుకోరాదు. ఈ విధంగా నాలుగయిదు రోజులు సేవిస్తే అర్థతలనొప్పి అదృశ్యమైపోతుంది.

**చిట్కా : రోజూ రెండు పూటలా ఉదయం పళ్ళు తోమేముందుగా, రాత్రి తినే ముందు రెండు ముక్కుల్లో శుద్ధమైన వేప నూనె చుక్కలు వేసుకుని లోనికి పీల్చాలి. దీనివల్ల సైనస్‌లో పేరుకున్న కఫం కరిగి శ్వాస సుఖంగా జరుగుతుంది.**

## సేంద్రియ వ్యవసాయంలో ఆదర్శప్రాయ రైతులు - వారి అనుభవాలు

రైతు సోదరులకు నమస్కారములు,

ఈ మాసం కొంతమంది ఆసక్తికరమైన రైతుల అనుభవాల్ని మీకు పరిచయం చేయదలచుకున్నాను. రసాయనిక ఎరువులు, పురుగు మందుల వ్యవసాయం స్థానంలో సేంద్రియ వ్యవసాయ పద్ధతులను ఆచరించాలని ఎకాలజీ సెంటరు సిబ్బంది గ్రామాల్లో రైతులకు సలహాలనిస్తున్న విషయం మీకందరికీ తెలుసు. ప్రతి సంవత్సరం మనకు జరిగే పంట నష్టాలకు, వ్యవసాయంలో పెరిగిపోతున్న పెట్టుబడులకు రసాయనిక వ్యవసాయం కారణమని కూడా మనం అర్థం చేసుకుంటున్నాం. కొంతమంది రైతులు ఇందులోని నష్టాన్ని అర్థం చేసుకుని పూర్తిగా సేంద్రియ వ్యవసాయంలోకి మారితే, మరి కొంత మంది ఇంకా ఊగిసలాడుతున్నారు. రెండు పడవలలో కాళ్ళు పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. మరికొంతమంది రసాయనిక ఎరువులు, పురుగు మందులు లేకుండా వ్యవసాయం అసలు సాధ్యకాదని ఇప్పటికీ నమ్మేవారు కూడా ఉన్నారు. మన తాతముత్తాతలు ఏ మాత్రం రసాయనాలు లేకుండా పంటలు తీశారు. అందరికీ తిండి వసతి కల్పించారని కూడా వీరికి తెలుసు. అది ఆ కాలంలో సాధ్యమయింది కానీ, ఇప్పటి పరిస్థితులలో రసాయనిక ఎరువులు, రసాయనిక పురుగు మందులు లేకుండా అసలు వ్యవసాయం సాధ్యమే కాదని వీరి పూర్తి నమ్మకం. ఇటువంటి పరిస్థితులలో తాతముత్తాతల కాలం నుండి వస్తున్న సంప్రదాయ వ్యవసాయ విజ్ఞానాన్ని నేటికి కొనసాగిస్తున్నవారు కొందరున్నారు. ఈ మాసం మనం వారిని గురించి మాట్లాడుకుందాం. ఎటూ వీరు మన జిల్లా వారే కాబట్టి వీలయితే వీరి అనుభవాల్ని వినేప్రయత్నం కూడా చేద్దాం.

### సంతాపం

ఎకాలజీ సెంటరు కూడేరు ఏరియా టీమ్ లీడరు శ్రీ యం. రామక్రిష్ణగారు (54 సం॥) ప్రమాదవశాత్తూ 03-12-2008న చనిపోయినారు.

శ్రీ రామక్రిష్ణగారు 1975 నుండి ఆర్.డి.టి. సంస్థలో వివిధ హోదాలలో ఆర్.డి.టి. గ్రామీణాభివృద్ధి పథకాల అమలులో పనిచేస్తూ, తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. సహచర సిబ్బందితోనూ, ప్రజలతోనూ స్నేహపూర్వకంగా ఆత్మీయంగా మెలుగుతూ మాతృ సంస్థ ధర్మాలకు వన్నె తెచ్చారు. మాలో ఒకడుగా, ఆత్మీయుడిగా, చెరగని చిరునవ్వుతో మెలిగే రామకృష్ణ ఇకలేరన్న బాధ మమ్మల్ని కలిచివేస్తున్నది.

ఈ దుఃఖభరిత సమయంలో రామక్రిష్ణగారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రామక్రిష్ణగారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ ఉన్నాము.

డైరెక్టరు మరియు సిబ్బంది,
ఎకాలజీ సెంటరు.

కుందుర్పి మండల కేంద్రంలోనే మఠం వారుగా పిలువబడే కొన్ని కుటుంబాలు ఈనాటి వరకూ సేంద్రియ వ్యవసాయాన్నే కొనసాగిస్తున్నారంటే మనకు ఆశ్చర్యం వేస్తుంది. దేశమంతా, జిల్లా అంతా రసాయనిక ఎరువులు పురుగు మందులు వాడుతూ ఉంటే, వీరు మాత్రం తమ పూర్వీకుల నుండి నేర్చుకున్న వ్యవసాయ పద్ధతులనే ఉపయోగిస్తున్నారు. సేంద్రియ వ్యవసాయమంటే ఏమిటో వారికి ఎవరూ నేర్పిన దాఖలాలు లేవు. పొలాలకు ఎరువులు వేయడం నుంచి, విత్తనం ఎంపికతో సహా పంటలకు చీడపీడల వరకూ అన్నీ సేంద్రియ వ్యవసాయ పద్ధతులే. ప్రకృతికి అనుకూలమైన వ్యవసాయమే.

→

"భూమాత అపారమైన తన అడవుల్ని, వన్య ప్రాణుల్ని, నదుల్ని, సముద్రాల్ని కాపాడుకుంటున్నంత వరకూ మానవ సంతతి వర్ధిల్లుతూనే ఉంటుంది" ఉపనిషత్తులు

## సేంద్రియ వ్యవసాయమే కుటుంబ ఆచారంగా కొనసాగింపు

వీరిని గురించి చెప్పేముందు వీరి పూర్వీకుల గురించి చెప్పాల్సి ఉంటుంది. వీరికి తెలిసిన తాతముత్తాతల కాలం నుండి వీరిది ఇదే విధానంగా ఉంటోంది. కుందుర్పి గ్రామంలో యర్రగుంటప్ప, చిన్నరుద్రప్ప అనే ఇరువురు అన్నదమ్ముల రైతు కుటుంబాలు. లింగాయతులు అవడం మూలంగా వీరిని 'మఠంవారు' అని పిలిచేవారు. అదే పేరే ఈనాటీ వరకూ స్థిరపడిపోయింది. ఆ ఇరువురు అన్నదమ్ముల సంతతిగా ఈనాడు వారి మనుమలు, ముని మనుమలు, దాదాపు 14 కుటుంబాలవారు ఉన్నారు. కుటుంబ ఆస్తులతో పాటు వ్యసాయ విజ్ఞానాన్ని కూడా వారసత్వంగా అందించారు. కేవలం సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను ఆచరించడమేకాదు ; అంతర పంటల ద్వారా పంటల్ని రక్షించుకునే విధానాలు, చీడ పీడలకు సంప్రదాయక విధానంలో ఎలా జాగ్రత్తలు తీసుకోవాలి అన్న తదితర సమాచారమంతా వారికి కొట్టినపిండి. రావలసిన వాటాల ప్రకారం వారే భూములను విభజించుకున్నారు. అరమరికలు లేకుండా సహజీవనం చేస్తున్నారు. తగాదాలు లేవు. పంచాయితీలు లేవు. ఏ సమస్య అయినా కుటుంబాల వారే కలిసి కూర్చుని సమస్యల్ని పరిష్కరించుకుంటారు. వారి తాత, ముత్తాతలద్వారా సంక్రమించిన గ్రామం దగ్గరి 8ఎ.80సెంట్ల భూమిలో చింతచెట్లు, కుంట, బండిజాడలు ఉండడంవల్ల ఉమ్మడి ఆధీనంలోనే బీడుగా ఉంది. గ్రామానికి దూరంగా 19ఎ.44సెంట్ల మెట్ట పొలము, చెరువు కింద 3ఎ.90సెం. భూమి ఉంది. గ్రామానికి దగ్గరగానే మరొక 8.44 భూమి ఉంది ఇందులో రెండు బావులున్నాయి, వాటాల ప్రకారం, భూముల్ని వారే విభజించుకుని వంతుల వారీగా నీళ్ళు పారించుకుంటూ ఆకుకూరలు, కాయగూరలు పండిస్తున్నారు. ఇలా కాయగూరలు, ఆకు కూరలు పండిస్తున్న చరిత్ర వారి తాతల కాలం నుండీ ఉన్నట్లుగా చెబుతున్నారు. ఇదే వారి అసలైన కార్యక్షేత్రం, మనం మాట్లాడుకుంటున్నదీనూ. సేంద్రీయ వ్యవసాయం కేవలం పంటలు పండించడంలోనే కాకుండా వారి జీవితాల్లో కూడా ప్రతిఫలిస్తున్నట్లుగా కనపడుతుంది. ఎందుకంటే ఒకే తల్లి పిల్లల్లోనే కానరాని ఒద్దిక తరాల అంతరాల్లో, వేరు వేరు తల్లుల పిల్లలైన వీరిలో కనపడే ఒద్దికకు కారణం వారనుసరిస్తున్న వ్యవసాయ విధానమే. సేంద్రీయ వ్యవసాయమంటే ప్రకృతిసిద్ధ వ్యవసాయం. ప్రకృతికి అనుకూలంగా పోతే బతకడం నేర్పుతుంది. సంపదను ఇస్తుంది. ఒద్దికను నేర్పుతుంది. శాంతిని ఇస్తుంది. అదే ప్రకృతికి వ్యతిరేకంగా నడుచుకుంటే, వ్యవసాయమే కానక్కరలేదు. మనిషి జీవితం ఒడిదుడుకులతో నిండి ఉంటుంది. మనశ్శాంతి ఉండదు. తద్వారా సమాజంలో కూడా శాంతి ఉండదు. ప్రకృతి వ్యవతిరేకంగా సాగే మన ప్రయాణం, సునామీలు, భూకంపాలే కాకుండా దేశాలలో అలజడులు, హింసా ఘటనలను ఎన్నింటినో మనం చూస్తున్నాము. అందుకే ప్రకృతిని మనం మన్నించినపుడు శాంతి మనల్ని ఆవహిస్తుంది.

## సేంద్రీయ వ్యవసాయమే జీవన విధానంగా

వీరందరూ కలిసి సాగు చేసుకునే తోటలో బావులలో నీళ్ళు చాలవని 8.5 ఎకరాలకుగానూ అయిదు ఎకరాలు మాత్రమే సాగు చేసుకుంటున్నారు. వారి వారి వాటాల ప్రకారం ఒక్కొక్క కుటుంబానికి 12 సెంట్ల నుంచి 25 సెంట్ల వరకూ విభజించుకుని అందరూ వంతుల ప్రకారం నీళ్ళు పారించుకుంటారు. రకరకాల ఆకుకూరలు, కాయగూరలు పండిస్తారు. గ్రామంలోనే సంతలో వారే అమ్ముకుంటారు. వీరు పండించిన ఆకుకూరలకు, కాయగూరలకు గ్రామంలో మంచి పేరుంది. కట్ట ఆకు కూర తక్కువిచ్చినా, కాయగూరల రేటు కాస్త పెంచినా, వీరివి మాత్రమే కొనుగోలు చేస్తారు. దీనికి కారణం ఈ ఆకుకూరలతో చేసిన పప్పు, కాయగూరలతో చేసిన కూరలు తొందరగా చెడిపోక పోవడమే కాకుండా రుచిగా కూడా ఉంటాయట. మార్కెట్టులో ఎన్నిరకాల కూరగాయలున్నప్పటికీ వీరికే గిరాకి. ఈ తక్కువ విస్తీర్ణంలో పండించే పంటలే వారి కుటుంబాలకు జీవనాధారాలు. ఏ మాత్రం డబ్బు పెట్టుబడులు లేకుండా, ఎరువుల నుంచి విత్తనాల వరకూ, కోతల నుంచి అమ్మకాల వరకూ వీరి శ్రమే పెట్టుబడి. నష్టం అనే పదం ఉండదు. వారి తోటలో కాయగూరలను పరిశీలించినప్పుడు మిరపకాయలు నవనవలాడుతూ తొడిమెలు గట్టిగా ఉన్నాయి. కాయలు రాలడం లేదు. అట్లాగే ఆకు కూరల మీద పురుగులేదు. అవి రంధ్రాలు చేయలేదు. వంకాయలో తొలిచే పురుగు కానరాదు. అలాగే బీర, కాకర, సొర లాంటి తీగజాతి కాయగూరలు కూడా మంచి నాణ్యతతో ఉన్నాయి. సాధారణంగా రసాయనిక ఎరువులు, మందులు వాడకుండా కాయగూరలేకాదు ; ఏ పంట అయినా పండించడం అసాధ్యం అని చాలా మంది అంటుంటారు. మరి పురుగు మందులు వాడకుండా, పుష్టికి రసాయనిక ఎరువులు లేకుండా ఇంతనాణ్యమైన పంటలను తీయడం ఎలా సాధ్యపడింది? ఇందులో ఎలాంటి మాయలు, మంత్రాలు, మ్యాజిక్కులు లేవుగానీ, తరతరాలుగా వారనుసరిస్తూ ఉన్న సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, బహుళపంట విధానాలే వారికి శ్రీరామరక్షగా ఉపయోగపడుతున్నాయి. పురుగు మందులు, రసాయనిక ఎరువులు ఎన్నివాడినా, ఇలాంటి నాణ్యమైన ఉత్పత్తులను పండించడం సాధ్యంకాదు. పైగా ఎరువులు, మందుల ఖర్చులు కొంపలు ముంచుతాయి.

## పంటలు పెట్టే విధానంలో బహుళ పంటలు - పురుగు నివారణ మార్గాలు

వీరు సాధారణంగా మార్చి ఆఖరు లేదా ఏప్రిల్ మొదటి వారంలో పశువుల ఎరువు వేసి దుక్కి చేస్తారు. సంవత్సరాంతం సీజనులో దొరికే వేప, కానుగ విత్తనాలను ఏరి నిలువ చేసుకుని బాగా నలుగగొట్టి ఎరువుగా వేస్తారు. వేపకానుగ విత్తనాల ఎరువు వేయడం వలన మంటలలో బూడిద తెగులు రాదని వీరి అనుభవం. ఉగాది పండుగ తర్వాత భరణికార్తెలో ఆకు కూరలతో మడులు వేస్తారు. ఒకే రకంగా వేయకుండా పలకలాకు, చుక్కాకు, చిలుకూర, కొత్తిమీర, తోటకూర, పెరుగుదంట్లు, చెక్కమంతి, పుదీనాలాంటివన్నీ వేస్తారు. పక్కనే వంకాయ, మిరప, బెండ, టమోటానార్లు పోస్తారు. ఆకు కూరలు వేసిన నారుమడుల్లోనే గట్లకు ఆముదం, మొక్కజొన్న వేస్తారు. గట్లకు ఆముదం వేయడంవల్లన ఆకు కూరలకు, నారుమళ్ళకు ఎండ తగలకుండా నీడనిస్తాయి. ఆకుకూరలకు పట్టే పురుగు లేతగా ఉన్న ఆముదం అడుగు భాగాన చేరి వాటిని తింటాయి. ఈ పంటలు రక్షింపబడుతాయి. పైగా ఆముదం ఆకులకు చలువ ఇచ్చే గుణం ఉండడం మూలంగా పంటలకు చల్లదనం ఉంటుంది. ఆ తర్వాత ఆముదాల వల్ల ఆదాయం కూడా ఉంటుంది. ఇక మొక్కజొన్న విషయానికొస్తే, మొక్కజొన్న కంకి విడిగినప్పుడు అందులో ఉండే పీచు ఆకుముడతలను, బిళ్ళ పురుగులను ఆకర్షిస్తుంది. పక్షులు కూర్చొని పురుగులు తినడానికి అనువుగానూ ఉంటాయి. కాయగూరలు ఆకు కూరలకు పంట నష్టం ఉండదు.

ఆకుకూరలు కోసిన వెంటనే ఆ మళ్ళల్లో టామోటో, మిరప, బెండ, వంకాయ నారుని నాటుతారు. మడుల గట్లమీద బీట్రూట్, ముల్లంగి, క్యారట్ లాంటి విత్తనాల్ని నాటుతారు. నేలపంటగా ఆకుకూరలు, మధ్యస్థ పంటగా కాయగూరలు, ఎత్తైన పంటలుగా ఆముదం, మొక్కజొన్న, తీగజాతి పంటలుగా గట్ల మీద కాకర, బీర, సొర పంటలు పండిస్తారు. దాదాపు 20 రకాల పంటలు కేవలం 12 సెంట్లలో ఒక పద్ధతి ప్రకారం అమర్చి పండిస్తారు. ఒక పంటకు ఇంకొక పంట తోడుగా వుంటుంది. ఒక పంట అయిపోయేలోగా ఇంకొక పంట ఎదుగుదలకు వస్తుంది. ఈ కాయగూర పంటలు జనవరి ఆఖరి వరకూ వస్తూనే ఉంటాయి. ఈ పంటల ద్వారా దాదాపు 6 నెలల కాలంలో 12 సెంట్ల భూమిలో రూ.12,000/- ఆదాయం పొందుతున్నట్లు మల్లికార్జున సంతోషం వ్యక్తపరిచాడు.

మరొక ముఖ్యమైన విషయమేమిటంటే, బీట్రూట్, క్యారెట్, ధనియాలు తప్ప ఏ విత్తనాన్ని వీరు కొనరు. అన్నీ తమ పంటల నుండే సేకరించుకుంటారు. హైబ్రీడ్ అసలు ఉండవు. వంకాయ, మిర్చి, టామోటో అన్నీ సంప్రదాయక విత్తనాలే. విత్తన మార్పిడి జరగాలని, ఒకటే విత్తనం అదే నెలలో వాడడంవల్ల విత్తన సామర్థ్యం తగ్గిపోతుందని వ్యవసాయ శాస్త్రజ్ఞులు అంటూ ఉంటారు. వారు వాడుతున్నవి ఎప్పటివో వారికే తెలియదు. కానీ దిగుబడి, కాయ నాణ్యత అంతా చక్కగా ఉన్నాయి. వీటికి రోగ నిరోధక శక్తి కూడా అధికంగా వున్నట్లు అర్థమవుతోంది. దీనిని బట్టి ఈ వాదన సరి అయింది కాదేమోననిపిస్తుంది. అయితే సంప్రదాయ విత్తనాలకు ఈ పరిమితులేవీ ఉండవని కూడా అర్థమవుతున్నది.

(మిగతా 3వ పేజీలో)

(2వ పేజీ తరువాత)

వీరి తోట వ్యవసాయంలో ఏనాడు రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడలేదు. పంటలు బాగా అభివృద్ధి అవుతాయని గ్రామంలోని మిగతా రైతులు చెప్పినా ఏ ఒక్కరు కూడా చెవి ఒగ్గలేదు. బయట వేరుశెనగ పొలంలో తరచుగా వేరుపురుగు వస్తోందని, ఒకసారి టిమ్మెట్ అనే రసాయనిక మందు వేశారట. ఆ సంవత్సరం నేల గట్టిపడిపోయిందని గమనించి, ఇంకెప్పుడూ రసాయనిక ఎరువులు కానీ, పురుగు మందుల జోలికి కానీ వెళ్ళలేదని మల్లికార్జున అనే రైతు చెప్పాడు. అంతేకాదు, ఎన్నడూ రసాయనిక ఎరువులు వేయని తమ వేరుశనగ పొలాన్ని దూరం నుండి చూపాడు. అది పచ్చగా కనపడుతుంటే, పక్కనే రసాయనిక ఎరువులు వాడుతున్న మిగతా రైతుల వేరుశనగ పొలాలు బెట్టకు తలలువాల్చి ఉన్నాయి. ఏనాడు వారి పంటలకు చీడపీడల బాధలేదని కూడా చెప్పాడు. తోటలో ఏదైనా పురుగు కనిపిస్తే, రాగి చెంబులో మజ్జిగ వేసి రాత్రంతా నాననిచ్చి ఉదయమే పశువుల గంజు, సద్ది అన్నం కలిపి పొలం మీద చల్లుతారట. రాగి చెంబులేకపోతే, సాధారణ పాత్రలో మజ్జిగ వేసి అందులో రాగి కడ్డీ ఉంచినా సరిపోతుందన్నారు. పచ్చేరు ఆకు కొమ్మలు పొలంలో అటొకటి, ఇటొకటి నాటి, వాటిమీద ఒక కొమ్మ వేస్తే తెగుళ్ళు రావని చెబుతున్నారు. నీళ్ళు పారే కాలువలో బ్రహ్మజెముడు కొమ్మలు నరికి వేస్తే, వాటి నుండి కారే పాలు ప్రభావంవల్ల రోగాలు రావని కూడా వీరి విశ్వాసం.వారి గ్రామానికి పక్కనే ఉన్న ఒక కొండలో ఉన్న నీటి కుంట నిండా నీటి గన్నేరు చెట్లున్నాయని, వాటి నుండి పడే ఆకులవల్ల ఆ నీరు కూడా పురుగు రాకుండా చేస్తుందని కూడా చెప్పరు.

### ఈ రైతులు మనకు నేర్పుతున్న పాఠాలు

మన జిల్లాలోనివి సాధారణ నేలలు. నీటి వసతి చాలా తక్కువ. వర్షాలు కూడా తక్కువే 20-50 ఎకరాల రైతులకు కూడా భుక్తి కరువే. మిగతా రైతులందరూ వారి తాత ముత్తాతల నాటి వ్యవసాయ పద్ధతులను వదిలేసి రసాయనిక ఎరువులకు, రసాయనిక పురుగు మందులకు, మార్కెట్టులోని విత్తనాలకు వ్యవసాయాన్ని అప్పగించినారు. దాని వలన భారీగా నష్టపోతూ వ్యవసాయం వదిలి బతికే దారిలేక అలాగే కొనసాగిస్తున్నారు. ఇటువంటి పరిస్థితులలో మఠం కుటుంబాల వారు తమ తాత ముత్తాతల కాలంనాటి వ్యవసాయ విధానాలనే కొనసాగిస్తూ, పెట్టుబడులు అన్న మాటే లేకుండా, శ్రమపడుతున్నారు. నాణ్యమైన పంటలు తీస్తున్నారు. పెట్టుబడులు లేవు కాబట్టి, నష్టం అన్న పదం కూడా వారి అనుభవంలోకి రాలేదు. తమవైన పద్ధతుల్లో సస్యరక్షణ పద్ధతులు అవలంభిస్తున్నారు. 12-25 సెంట్ల స్థలంలోనే రకరకాల కాయగూరలు, ఆకు కూరలు పండించడం, ఒక కుటుంబానికి కావలసిన ఆదాయాన్ని సమకూర్చు కోవడం అన్నది ఒక అద్భుత కళ. సూది మొన మోసేంత స్థలం కూడా ఖాళీగా లేకుండా, తక్కువ ఎత్తులో పెరిగే ఆకుకూరలు, మరికొంత ఎత్తులో పెరిగే కాయగూరలు, మరింత ఎత్తుగా పెరిగే ఆముదం, మొక్కజొన్న, తీగెజాతి కాయగూరలు అంచెలంచెల వ్యవసాయాన్ని గుర్తుకు తెస్తుంది. పైగా వాడే విత్తనాలన్నీ సంప్రదాయకమైనవే. ఈ పద్ధతులనే పాలేకర్ చెప్పాడు. దీనినే పాలేకర్ నమూనా వ్యవసాయం అంటారు. పాలేకర్ కంటే ముందుగానే వీరు ఈ పద్ధతులను ఆచరిస్తుండడంచేత దీనిని మఠం వారి నమూనాగా పిలిస్తే బాగుంటుందేమో! విత్తనం దగ్గర్నుంచీ, మార్కెట్టు వరకూ ఎక్కడా పెట్టుబడుల్లేవు. మానవ శ్రమ మాత్రమే పెట్టుబడి. శ్రమే పెట్టుబడిగా భూమిని నమ్ముకున్న నిజమైన భూమి పుత్రులు వారు. వారి విజయ రహస్యం అంతా వారు అనుసరిస్తున్న సేంద్రీయ వ్యవసాయం, సంప్రదాయక విత్తనాలు, బహుళ పంటల విధానాల్లో ఉంది. వీరి అనుభవాల్ని మనం నమూనాగా స్వీకరించి, సేంద్రీయ వ్యవసాయ పద్ధతులను, బహుళ పంటల విధానాలను మరింతగా పెంపొందించుకుందాం.

మీరందరూ ఒకసారి కుందుర్పి గ్రామం వెళ్లి, మఠంవారి వ్యవసాయ పద్ధతులను ప్రత్యక్షంగా చూస్తే మీకు కనువిప్పు కలుగుతుంది.

మీ శ్రేయోభిలాషి,

**డా॥ వై.వి. మల్లారెడ్డి**

**డైరెక్టరు - ఎకాలజి సెంటరు**

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## విత్తనాలు నిలువ ఉంచడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

విత్తనం కోసం మార్కెట్టుపై ఆధారపడడం మొదలైన తరువాత అదునులో విత్తనం సమకూర్చుకోవడం ప్రతి సంవత్సరం రైతుకు సమస్యగా ఉంటోంది. ఈ సమస్య రైతును ఎన్నోరకాలుగా బాధపెడుతూ ఉంటుంది. ఒక్కోసారి డబ్బుపెట్టినా మార్కెట్టులో విత్తనం దొరకదు. దొరికినా నాణ్యత ఉండకపోవచ్చు. ఇటువంటి సందడిలో వ్యాపారులు రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టే అవకాశం ఉంటుంది. వీటికి తోడు రైతుకు డబ్బు సమకూర్చుకోవడం ప్రధాన సమస్య. మెట్ట వ్యవసాయం రైతును ఆ సంవత్సరం ఒడ్డుకు చేరుస్తుందోలేదోనని ఆందోళనకుతోడు అదును ప్రారంభంలో విత్తనసమస్య కూడా ఎక్కువగా బాధిస్తుంటుంది. అందుకే ఎకాలజీ సెంటరు తరపున ఆయా గ్రామాల్లో విత్తన బ్యాంకు ఏర్పాటు చేసుకోవాలని రైతులకు నచ్చచెప్పడం జరుగుతూ ఉంది. దీని ప్రకారం సాధ్యమయినంతవరకూ ఆ గ్రామ రైతులకు కావలసిన విత్తనం ఆ గ్రామంలోనే నిలువ ఉంచుకోవాలి. అవసరమైతే ఇతర గ్రామాల రైతులకు కూడా సరఫరా చేయగలగాలి. కొన్ని గ్రామాలలో అనంతజ్యోతిలాంటి వేరుశన రకాలు విత్తనోత్పత్తి కొరకే ఫౌండేషన్ విత్తనం రైతులకు ఇవ్వడం జరిగింది. వారు పండించిన పంట, ఇతర రైతులకు విత్తనంగా వ్యాప్తి చెందాలి. ఈ రకంగా కూడా విత్తన బ్యాంకుకు చాలా ప్రాధాన్యత ఉంటుంది. ముఖ్యంగా అదునులో రైతు విత్తనం కొరకు పట్టణాల దారిపట్టరాదన్నదే ప్రధానమైన అంశం.

అయితే విత్తనాన్ని నిలువ ఉంచడంలో మనం జాగ్రత్తలు తీసుకోకపోతే విత్తనం పురుగు పాలయ్యే అవకాశం ఉంటుంది. ఒకసారి పురుగు పట్టిన తర్వాత మనం పడిన శ్రమ అంతా వృధా అవుతుంది.

### పప్పు ధాన్యపు విత్తనాలు

కందులు, అలసందలు, పెసలు లాంటి పప్పుధాన్యాలు నిలువ ఉంచే పాత్రలు బాగా ఎండలో సూర్యరశ్మికి ఆరబెట్టిన తరువాత వాటి లోపల భాగాన వేపనూనె పట్టించి నీడలో ఆరబెట్టాలి. విత్తనంలో తేమశాతం చాలా తక్కువగా ఉండాలి. పాత్రలలో వేపాకువేసి విత్తనాన్ని నిలువ ఉంచాలి. గాలి, తేమ తగలని ప్రాంతంలో విత్తనాన్ని భద్రపరచాలి.

ఈసారి వేరుశనగలో కొత్తరకాలు విత్తనం కాయగా కొంత మంది రైతులు వేశారు. వాటిని చాలా జాగ్రత్తగా భద్రపర్చాలి. విత్తనానికి తేమ ప్రధాన శత్రువు అన్న విషయం మరువరాదు. విత్తనం కాయలో తేమ 11 శాతం ఉండునట్లు చూడాలి. అందుకు కాయనిలువ చేసుకునే గదిలో గ్రామాల్లో దొరికే రాళ్ళ సున్నంతో గోడలకు సున్నంపూసి గదిని సిద్ధం చేసుకోవాలి. పశువుల గంజు పేడతో నేలను శుభ్రంగా అలికి ఉంచుకోవాలి. కొయ్య దిమ్మెలు లేదా ఏదైనా ఎత్తులో కాయల బస్తాలు నిలువ చేసుకోవాలి.

### వేరుశనగ నిల్వలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

వేరుశనగ గింజలలో తేమ 9 శాతం నుండి 11 శాతం కన్నా తక్కువ ఉండేలా బాగా నీడలో ఎండబెట్టిన తర్వాత నిలువ చేయాలి. తేమ అధికంగా ఉంటే వాటిలో తొందరగా పురుగు పడడమేకాకుండా శిలీంద్రాలు ఎక్కువై అఫ్లోటాక్సిన్ అనే విషపదార్థం గింజలలో ఎక్కువవుతుంది. విత్తనాన్ని నిలువచేసే గదిలో పురుగు వ్యాప్తి చెందడానికి అవకాశమున్నవాటిని వేటిని ఉంచకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. గది గోడలకు వేపనూనె పిచికారి చేయాలి. కాయల్ని నింపే సంచులను పశువుల మూత్రంతో బాగా తడిపి ఆరబెట్టాలి లేదా వేపనూనెలో ముంచి అరబెట్టుకోవాలి. సాధ్యమయినంత వరకూ కొత్త సంచులయితేమేలు. ఒక వేళ సంచులు పాతవే అయితే వాటికి వేపనూనె, కిరోసిన్ కలిపిన ద్రావణం బాగా పట్టించి పూర్తిగా ఎండలో ఆరనివ్వాలి. సంచులకు చిరుర్లు లేకుండా కుట్టి పెట్టుకోవాలి.

సంచులు నిలువ ఉంచేటప్పుడు భూమి నుంచి తేమ తగలకుండా ఎత్తైన చెక్క దిమ్మెలమీద నిలువ ఉండాలని ముందే తెలుసుకున్నాంగదా ! అలాగే వరుసకు వరుసకు మధ్య 2-3 అడుగుల దూరం ఉండేటట్లుగా కూడా చూడాలి. దీనివలన ప్రతి లాటు చుట్టూ అప్పుడప్పుడూ తిరుగుతూ వాటిని పరిశీలించడానికి వీలవుతుంది. ఇలా చూచినప్పుడు ఎక్కడైనా పురుగు ఆనవాళ్ళు కనపడితే వేపనూనె పిచికారి చేయడంవలన పురుగు వ్యాప్తి చెందదు.

# సుస్థిర వ్యవసాయ పద్ధతుల్లో....

## స్వంత భూమిలేకున్నా కృషి, పట్టుదలతో సిరులు పండిస్తున్న ధర్మపురి గ్రామస్థులు

ధర్మవరం మండలానికి చెందిన ధర్మపురి గ్రామంలో సేంద్రీయ వ్యవసాయానికి తోడు కృషి, పట్టుదల, పరస్పర సహకారం పెట్టుబడులుగా 15 కౌలు రైతు కుటుంబాలు కరువు లేమి అన్నవి ఎరుగకుండా జీవనం కొనసాగిస్తున్నారు. ఈ రైతుల పనివిధానం, పరస్పర సహకారం, ఒకే మాట మీద కట్టుబడి ఉండడాన్ని గమనిస్తే ఆశ్చర్యం వేస్తుంది. స్వంత అన్నదమ్ములలోనే, దాయాదులలోనే ఐక్యత లేకుండా ఏదో విధంగా తగాదాపడే మనుషులే ఎక్కువగా కనపడుతున్న ఈ రోజుల్లో విభిన్న సామాజిక వర్గాలకు చెందినవారు ఒకే గొడుగుకింద చేరడం, ఎలాంటి తగాదాలు భేదాభిప్రాయాలు లేకుండా కుటుంబాలు యావత్తూ కష్టపడుతూ లాభసాటిగా తమలపాకులు పండిస్తున్నారు.

ధర్మపురి గ్రామంలో కొన్ని కుటుంబాలు తాతముత్తాతల నుండి తమలపాకు సాగుమీద ఆధారపడి బతుకుతున్నారు. ఈ కుటుంబాలకు సంబంధించిన 15 కుటుంబాలు కలిసి ఉమ్మడిగా తమలపాకులు సాగు చేయలనుకున్నారు. వారికి స్వంతభూముల్లేవు. తమలపాకులు పండించడానికి పెట్టుబడులు కావాలి. నీటిపారుదల సౌకర్యం ఉండాలి. తమలపాకుల తోటకు నిత్యం మానవ శ్రమ ఉండాలి. 15 సెంట్ల తమలపాకుతోటను సాగుచేయడానికి ప్రతి రోజూ ఇద్దరు మనుషులు ఉండాలి. అంట్లు కట్టడానికి, వాటికి నీళ్ళు పారించడానికి, తెగుళ్ళు తగిలిన ఆకులు ఎప్పటికప్పుడు ఏరివేయటానికి, ఆకులు తెంపడానికి మనుషులు పనిచేస్తూనే ఉండాలి. ఈ పనులలో అనుభవం కలిగినవారు తమలపాకుల సాగును జీవనంగా ఎంచుకున్నారు. ఒక్కొక్కరి కుటుంబం 15 సెంట్ల తోటలో నెలకు 15 వేలు దాకా ఆదాయం పొందుతున్నారు.

మొదట 15 కుటుంబాలకు చెందినవారు కలిసి ఒక సంఘంగా ఏర్పడినారు. దానికి పిన్నపెద్దగా తమలోంచే ఇ.శ్రీరాములు అనే ఆయనను ఎన్నుకున్నారు. సంఘం తరఫున బోరువసతి ఉండే భూమిని 3 ఎకరాలు గుత్తకు తీసుకున్నారు. గుత్త సంవత్సరానికి 15 వేల రూపాయలు. మూడు ఎకరాల్లో 1.5 ఎకరాలో ఒక్కొక్కరు 15 సెంట్లలో తమలపాకుతీగలను నాటుకున్నారు. 1.5 ఎకరం తోట ఒకే తోటగా ఉన్నా, లోపల ఎవరి భాగం వారిదే మూడు సంవత్సరాల తరువాత బీడుగా ఉన్న భూమిలో మరొక తోట అభివృద్ధి చేస్తారు. సాధారణంగా తమలపాకు తీగలను గాలి తగులరాదు. అందుకు మొదట ఉండే పాదులకు దిగుబడి తక్కువగా ఉంటుంది. ఇవన్నీకూడా దృష్టిలో ఉంచుకుని అందరికీ సమాన ఆదాయం ఉండేటట్లు ఏర్పాటు చేసుకున్నారు. తోటకలిసి ఉన్నా ఒకరి తోటలో మరొకరు ఆకులు కోయరు. పిన్నపెద్ద ఏది చెబితే అదే ఫైనల్. ఇంత వరకూ ఒక్కసారికూడా తగాదాలు కానీ, మనస్పర్థలు కానీ రాలేదంటే వారి ఒద్దిక ఎంత చక్కగా ఉందో అర్థం చేసుకోండి.

పంట దిగుబడులలో వీరి విజయ రహస్యం అంతా వీరు అనుసరించే సేంద్రీయ పద్ధతుల్లోనే ఉన్నాయి. తీగలకు రసాయన ఎరువులు వేయరు. పశువుల ఎరువు, మేకలు, గొర్రెల పెంట వాడుతారు. ఆకులకు ఎక్కడైనా తెగులు సోకితే, అటువంటి ఆకులను వెంటనే ఏరివేస్తారు. దానివలన రోగం వ్యాప్తి చెందదు. పశువుల ఎరువులు వాడుతుండడం మూలాన ఏ తెగుళ్ళు రావని వారు అనుభవపూర్వకంగా చెబుతున్నారు. సాధారణంగా తమలపాకులు చాలా సున్నితంగా ఉంటాయి. తీపుగలిగి, సున్నితంగా ఉన్న ఆకులను పురుగులు విశేషంగా ఆకర్షిస్తాయి. వీరి నిరంతర జాగురూకత, సేంద్రీయ పద్ధతుల మూలంగా తెగుళ్ళకు దూరంగా పంటను కాపాడుకుంటున్నారు. వీరు చేస్తున్న టువంటి వ్యవసాయం సేంద్రీయ పద్ధతుల్లో పరస్పర సహకార వ్యవసాయ పద్ధతి అని అనవచ్చు. ఒకరికొకరు పనిలో సహాయపడుతారు. కూలీ చెల్లింపులు ఉండవు. తిరిగి పనిచేయడం ద్వారా మాత్రమే బదులు తీర్చుకుంటారు.

వీరికి మార్కెటు సమస్య ఉండదు. సేంద్రీయపద్ధతుల ద్వారా పండించిన ఆకులు కాబట్టి వాడకుండా నవనవలాడుతూ ఉంటాయి. అందుకే వీరి ఆకులకు గిరాకీ ఎక్కువ. వ్యాపారాలను వీరు తోటవద్దకు రానివ్వరు. ఆ విధంగా తోటవద్దే వ్యాపారం చేస్తే, వ్యాపరస్తులు అదనంగా ఆకులు అడుగుతారని ధర్మవరంలోనే వీరు అమ్ముతారు. 15 సెంట్లలో ఒక్కొక్కరి భాగం నుండి 200 నుండి 300 వందల కట్టల ఆకులు దిగుబడివస్తాయి. (కట్ట 100 ఆకులు) కట్ట 20-25 వరకూ అమ్ముడుపోతుంది. కనీసంగా ఒక్కొక్కరికి 15 రోజులకు 5 వేల నుంచీ 7 వేల వరకూ ఆదాయం వస్తుంది.

వీరికి ప్రధాన సమస్యగాలి. ఆకుతోటలకు గాలి ప్రధాన శత్రువు. తమలపాకు తీగలకు సపోర్టు చాలా ముఖ్యమైనది. అవిసె మొక్కలు నాటి వాటిని ఎత్తుగా పెంచుతారు. ప్రస్తుతం అవిసె మొక్కలకు రంధ్రాలు తొలిచే పురుగు పట్టడంవల్ల, ఆ పొడి తమలపాకులపై రాలుతూ ఆకుల నాణ్యతను దెబ్బతీస్తోందని చెప్పారు. ఎకాలజీ సంస్థ ద్వారా వారికి కావలసిన వెదురు బొంగులు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు.

### జీవామృతం ఆకుల నాణ్యతను పెంచింది

ఎకాలజీ సెంటరు సభ్యులు వారికి ద్రవ జీవామృతం తయారు చేసుకోవడాన్ని నేర్పారు. జీవామృతం వాడినప్పటి నుండీ తమలపాకులు మంచి రంగు నాణ్యత వచ్చినట్లు వారు చెప్పారు. ఎల్లప్పుడూ తోట పనిలో ఉంటున్నమాకు జీవామృతం తయారు చేసుకోవడం చాలా సులభమైన పని అని అన్నారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతులతోపాటు, కృషి, పట్టుదల, పరస్పర సహకారంతో ఈ రైతులు స్వంత భూమిలేకున్నా, నిరంతర ఆదాయంతో బతుకుతున్నారు. పరస్పర సహకార వ్యవసాయ పద్ధతిని ఆచరణలో విజయవంతం చేస్తున్నారు.

ప్రచురణ: డైరెక్టరు - ఆర్.డి.టి. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in
actionf_atp@dataone.in